సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 15 । మే । 2023



భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

జిల్లా వ్యాప్తంగా హనుమజ్జయంతిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. 9లో



పర్యావరణహిత జీవనశైలితో సంపూర్ణ ఆరోగ్యం 8లో

పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవాలని డీఆర్వో సత్యనారాయణ రాజు అన్నారు.



టెన్త్ టాపర్లకు సన్మానం

టెన్త్‌లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను సీనియర్ అసిస్టెంట్ దుమంతి సత్యనారాయణ సత్కరించారు. 8లో

న్యూస్‌రీల్

బొర్రాకు పర్యాటకుల తాకిడి



బొర్రా గుహలను తిలకిస్తున్న పర్యాటకులు

అనంతగిరి : మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు తాకిడి పెరిగింది. వేసవి సెలవులు నేపథ్యంలో రెండు వారాలుగా పర్యాటకుల సంఖ్య అంతంతమాత్రంగా ఉండేది. ఆదివారం మాత్రం పర్యాటకుల తాకిడి పెరిగింది. గుహలను 2,200 మంది తిలకించారు. సుమారు రూ.2 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. కటికి, తాటిగుడ, సరియా, చిట్టంపాడు, జలపాతాలు, డముకు వ్యూపాయింట్, కాఫీ ప్లాంటేషన్ సందర్శిత ప్రాంతాలన్నీ పర్యాటకులతో కళకళలాడాయి.

ఆర్గనైజింగ్ సెక్రటరీగా గిరి



నియామక పత్రాన్ని అందుకుంటున్న గిరి

చింతపల్లి రూరల్: అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా మండలంలోని మూలగరువు ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు ఉగ్రంగి గిరి ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు పీవి రమణ, రాయలసీమ డీఐజీ వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షులు కె.సత్యనారాయణ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు ఆయన తెలిపారు.

19న అరకులో మెగా జాబ్‌మేళా

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 19న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 10 కంపెనీలతో జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. అపోలో ఫార్మసీ, నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు, డక్కన్ కెమికల్స్, పేటీఎం, మదర్ ఎండ్ ఫాదర్ హెల్త్ కేర్ సర్వీసెస్ తదితర కంపెనీలు పాల్గొంటున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా విద్యార్హతలు కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల వయసు గల యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఐటీఐలో జరిగే జాబ్‌మేళాకు పాన్ కార్డు, ఆధార్ సంబంధిత ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు. పూర్తివివరాలకు9988853335,7993795797లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఏవోబీలో ముమ్మరంగా కూంబింగ్



కూంబింగ్‌కు వెళ్తున్న పోలీసు బలగాలు

వై.రామవరం: మండల సరిహద్దు అటవీ ప్రాంతమైన ఏవోబీలో పోలీసులు కూంబింగ్ ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇటీవల మండల సరిహద్దు ప్రాంతమైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అటవీ ప్రాంతంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పుల నేపథ్యంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో సరిహద్దు అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. అటవీ ప్రాంతాన్ని బలగాలు జల్లెడ పడుతున్నాయి.

కిరండూల్ లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): భద్రతా కారణాల వల్ల కొత్తవలస–కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖలో సోమవారం రాత్రి బయల్దేరిన విశాఖపట్నం–కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. ఈనెల 15న కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరుతుంది. విశాఖలో ఈనెల 14, 15వ తేదీల్లో బయల్దేరే విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్‌లో ఈనెల 15, 16వ తేదీల్లో బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలు దంతేవాడ నుంచి బయల్దేరుతుంది.



ఉత్సవ విగ్రహం, పాదాలను మోస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



ఊరేగింపులో ఆకట్టుకున్న కేరళ డప్పు వాయిద్యాలు



మోదకొండమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు

కొలువుదీరిన మోదమ్మ

- పాడేరులో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం
- ఘనంగా విగ్రహం, పాదాలు, ఘటాల ఊరేగింపు
- సతకంపట్టు వద్ద భక్తిశ్రద్ధలతో ప్రతిష్ట
- కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పూజలు



మోదకొండమ్మఅమ్మవారి ఘటాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సాక్షి,పాడేరు : మన్యం ప్రజలు ప్రజల ఆరాధ్య దైవం , చల్లని తల్లి పాడేరు మోదకొండమ్మతల్లి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం వేకువజామునే ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు దంపతులతో పాటు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వర్తన పిన్నయ్యదొర, నవర కొండ బాబు, తమర్బ ప్రసాద్‌నాయుడు తదితరులు సతకంపట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి కాలినడకన మోదకొండమ్మతల్లి ఆలయానికి ఎమ్మెల్యే దంపతులు, భక్తులు చేరుకుని పుజాసామగ్రి పంపిణీ చేశారు. ప్రభుత్వం తరపున కలెక్టర్ సుమిత్‌కుమార్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.అనంతరం మోదకొండమ్మతల్లి మూలవిరాట్‌తో పాటు ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.

సతకంపట్టు వద్ద..

మోదకొండమ్మతల్లి మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా పాదాలు, ఉత్సవ విగ్రహం, ఇతర ఘటాలను మెయిన్‌రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సతకంపట్టు మండపంలో కొలువుదీర్చారు. ఉత్సవాలు ప్రారంభంతో ఆదివారం ఉదయం నుంచి పాడేరు పట్టణంలో సందడి నెలకొంది. ఆలయంలో అమ్మవారికి కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఇతర ఇత్తడి ఘటాలకు కుంకుమార్చన నిర్వహించారు.

విగ్రహాలను మోసేందుకు..

ఊరేగింపులో ఉత్సవ విగ్రహాన్ని ఎస్పీ తుహిన్‌సిన్హా, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ మోశారు. ఉదయం 5గంటల నుంచి 9గంటల వరకు ఘటాల ఊరేగింపులో గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయులు, గిరిజనేతరులు, వర్తకులు, పలు రాజకీయ పార్టీల నేతలు, అన్ని వర్గాల భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వర్తన పిన్నయ్యదొర,తమర్బ ప్రసాద్‌నాయుడు, నవర కొండబాబు సతకంపట్టు వద్ద ఉత్సవాలను ప్రారంభించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

గిరిజన సంప్రదాయ కొమ్ము, థింసా నృత్యాలు, గరగల డప్పులు, నృత్యాలు, కేరళకు చెందిన వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్ గిరిజనుల సంప్రదాయ కొమ్మును ధరించారు. ఐటీడీఏ పీవో అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి డాక్టర్ తమర్బ నరసింగరావు దంపతులు, వైస్ ఎంపీపీ కె.కనకాలమ్మ, వ్యవసాయ సలహామండలి జిల్లా అధ్యక్షురాలు ఎం.సరస్వతి తదితరులు థింసా నృత్యాలు చేసి భక్తులను ఉత్సాహపరిచారు.

గిరిజన సంప్రదాయం ప్రతిబింబించేలా..

గిరిజన సంప్రదాయం ప్రతిబింబించేలా గిరిజన కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో పీవో అభిషేక్ కళాప్రదర్శనలను ప్రారంభించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ గిరిజనుల సంప్రదాయ కొమ్మును తలకు ధరించారు. ఐటీడీఏ పీవో కొమ్ము తలపాగాను ధరించి గిరిజనుల డప్పు వాయిద్యాలతో సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్టేజ్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

భక్తుల సేవలో..

పాడేరు రూరల్ : పలువురు దాతలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారి గుడి ప్రాంగణంలో సత్యసాయి సేవా ట్రస్ట్ ప్రతినిధులు భక్తులకు ఉచితంగా ప్రసాదం, పులిహోరా పంపిణీ చేపట్టారు. పాత బస్టాండ్ వద్ద గిరిజన విలేకరుల సేవా సంఘం ప్రతినిధులు భక్తులకు సుమారు రెండు వేల మజ్జిగ ప్యాకెట్లను పంపిణి చేశారు.

పలువురికి సత్కారం

అమ్మవారిని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు, సభ్యులు శంకర్‌నాయక్, రామలక్ష్మి, మత్స్యరాస విశ్వేశ్వరరాజు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వీరిని శాలువా కప్పి సత్కరించారు. అమ్మవారి ఫొటోలను జ్ఞాపికలుగా అందజేశారు. కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, భర్త పార్వతీపురం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పరీక్షిత్‌రాజ్ అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి అమ్మవారి ఫొటోలను అందజేశారు.

స్టాళ్లు ఏర్పాటు

పాడేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం పక్కన ఏర్పాటుచేసిన స్టాళ్లను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఏఎస్పీ ధీరాజ్ ప్రారంభించారు. ఐటీడీఏ కాఫీ, ఉద్యానవన విభాగం, స్పైసెస్ బోర్డు, పశుసంవర్ధక, వ్యవసాయశాఖలు, ప్రకృతి వ్యవసాయ, పోలీస్ శాఖ సమాచార శాఖ, ఐసీడీఎస్, జీసీసీ, వైద్య ఆరోగ్యశాఖలు స్టాళ్లు ఏర్పాటుచేశారు. కార్నివాల్ ఐటీడీఏ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్, పాత బస్టాండ్ మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు కొనసాగింది. ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్, వెంకటేశ్వరరావు, డీడీ కొండలరావు పాల్గొన్నారు.

అందరి సహకారంతో విజయవంతంగా..

- జాతర ఘనంగా నిర్వహించడం ఎంతో ఆనందం
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: మోదకొండమ్మతల్లి గిరిజన జాతరను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించడం ఆనందంగా ఉందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో గిరిజన సాంస్కృతిక కళాప్రదర్శనల కార్యక్రమాన్ని ఆయనతో పాటు ఐటీడీఏ పీవో అభిషేక్, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ, చింతపల్లి ఏఎస్పీ కిషోర్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాత్సవ, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, డాక్టర్ నర్సింగరావు తుడుము డప్పు మోగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోదమ్మజాతరకు ప్రభుత్వంతో పాటు అన్ని వర్గాల భక్తులు సహకరిస్తున్నారన్నారు. ప్రభుత్వం కూడా నిధులు మంజూరు చేసిందన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించే లక్ష్యంతో అధికార యంత్రాంగమంతా పనిచేస్తుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఉత్సవాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితర ప్రభుత్వ పెద్దలంతా సహకారం అందించారన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన విద్యార్థిని, విద్యార్థులు, గిరిజన మహిళలు పోటాపోటీగా సాంస్కృతిక కళా ప్రదర్శనలు నిర్వహించారు. గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, డీఈవో సలీమ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



తుడుము కొట్టి జాతరను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పాడేరు.అరకు ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి,పాల్గుణ,ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు



గిరిజనుల సంప్రదాయ కొమ్మును ధరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్



రంపచోడవరం గిరిజన కళాకారుల గిరిజన సంప్రదాయ కొమ్ము నృత్యం



థింసా నృత్యాలు చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర,పీవో అభిషేక్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



మోదకొండమ్మతల్లిని దర్శించుకున్న కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజ్ తదితరులు



ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా గరగల నృత్యం



కొమ్ము ధరించి డప్పు వాయిస్తున్న పీవో అభిషేక్,పక్కన పాడేరు ఏఎస్పీ ధీరజ్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

36 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరు అరెస్టు, కారు, స్కూటీ స్వాధీనం



పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

కొయ్యూరు : మన్యం నుంచి మైదాన ప్రాంతానికి ఇన్నోవా కారులో తరలిస్తున్న 36 కిలోల గంజాయిని కొయ్యూరు ఎస్ఐ రాజారావు ఆధ్వర్యంలో పిట్టచలం శివారున ఆదివారం పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి. ముందస్తు సమాచారం మేరకు పిట్టచలం సమీపంలో వాహనాల తనిఖీ చేపడుతుండగా మొదట స్కూటర్‌పై ఒకరు వెళ్తుండగా పట్టుకున్నారు. తరువాత వెనక వస్తున్న కారును తనిఖీ చేయగా దానిలో 36 కిలోల గంజాయి బయటపడింది. చిత్తూరు జిల్లా ములకచెరువు మండలం పెద్దిపాలేనికి చెందిన మేకల రామారావు, శ్రీనివాసరావును అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు, ఒక కారు, స్కూటీని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

మెట్లు దిగుతూ జారి పడి హెచ్‌సీ మృతి

అప్పలరాజుపేటలో విషాదం



సతీష్‌బాబు (ఫైల్)

రాజవొమ్మంగి : కాకినాడ పరిధిలో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సు హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మండలంలోని అప్పలరాజుపేట గ్రామానికి చెందిన హనుమంతు సతీష్‌బాబు (47) కాకినాడలో శనివారం రాత్రి మరణించారు. దీంతో అప్పలరాజుపేటలో విషాదం అలముకొంది. సతీష్‌బాబు నివాసం వుంటున్న అద్దె గృహంలో మేడ మెట్లు దిగుతుండగా కాలుజారి పడిపోయినట్టు బంధువులు తెలిపారు. సతీష్‌బాబు తల వెనుక భాగంలో గాయమై అక్కడికక్కడే మరణించారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో సతీష్‌బాబు భార్య తన ఇద్దరు పిల్లలతో పాటు తల్లిగారి ఊరైన అనకాపల్లి జిల్లా, గొలుగొండ మండలం డొంకాడ గ్రామానికి వెళ్లారు. ఒంటరిగా వున్న సతీష్‌బాబు మేడ ఎక్కి కిందికి దిగుతుండగా అదుపు తప్పి పడిపోయినట్టు కుటుంబీకులు తెలిపారు. మృతి చెంది పడి వున్న సతీష్‌బాబును చూసిన గృహ యజమాని కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం ఆదివారం ఉదయం వెలుగు చూసింది. కాకినాడ –2 టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఏం జరిగింది.. అనే అంశంపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. సతీష్‌బాబు ఎక్కువగా తిరిదే వంటి ప్రధాన ఆలయాల్లో సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహించేవారు.

జాతీయ పక్షి జాడేదీ?

అటవీప్రాంతంలో ఎక్కడ పడితే అక్కడ కనిపించే జాతీయ పక్షి నెమలి జాతి నానాటికి కనుమరుగవుతోంది. సుమారు 15 ఏళ్ల క్రితం వరకు ఏజెన్సీలోని అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న ప్రధాన రహ దారులు, పొలాలు, గ్రామశివారుల్లో కనిపించేవి. ఇప్పుడు చూద్దామంటే మచ్చుకైనా వాటి జాడ కనిపించడం లేదు.ఎక్కడో లోతట్టు అటవీ ప్రాంతంలో తప్ప, మిగతా ప్రదేశాల్లో నెమలి అరుపులు వినిపించడం లేదు.

- కానరాని మయూరాలు
- ఒకప్పుడు పదివేలకు పైగా నెమళ్లు
- నేడు మూడు వేల లోపే..
- విచ్చలవిడిగా వేట
- పురుగు మందుల అవశేషాలున్న పంటలను తిని మృత్యువాత
- అడవి అంతరించిపోతుండటం మరో కారణం

వై.రామవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీలో నెమళ్ల జాడ కనిపించడం లేదు. ఒకప్పుడు 10 వేల వరకు వీటి సంతతి ఉండేది. ఇప్పుడు మూడు వేలకు లోపే ఉందని అటవీశాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇవి అంతరించి పోవడానికి వెనుక చాలా కారణాలు లేకపోలేదు.

- వేటగాళ్లు విచ్చలవిడిగా వేటాడుతున్నారు. కొంతమంది విద్యుత్ అమర్చడం వల్ల మృత్యువాతపడుతున్నాయి.
- పొలాలకు పిచికారీ చేసే క్రిమిసంహారక మందుల ప్రభావం కూడా నెమళ్ల సంతతిపై చూపుతోంది. ఆహార ధాన్యాలు తినేందుకు వస్తున్న నెమళ్లు పురుగు క్రిమిసంహారక మందుల అవశేషాలు కారణంగా మృత్యువాత పడుతున్నాయి. వై.రామవరం మండల సరిహద్దు గ్రామాలైన దబ్బపాలెం, సంగలకొండ, చాకిరేవులు తదితర గ్రామాల్లో పురుగుమందులు అవశేషాలున్న పంటలను తిని నెమళ్లు మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి.
- కొంతమంది అడవిలో నెమళ్లు పెట్టిన గుడ్లను, వాటి పిల్లలను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఈ కారణంగా కూడా వాటి సంతతి వృద్ధి చెందడం లేదు.
- మైదాన ప్రాంతానికి చెందిన వేటగాళ్లు ఏజెన్సీ ప్రాంతానికి వచ్చి ఆవుల సాయంతో నెమళ్లను వేటాడేవారు. ఆవుల చాటున మాటువేసి నెమళ్లను పట్టుకుని హతమార్చేవారు. లోతట్టు ప్రాంతాలైన జంగాలకోట, బురదకోట, రాములుకొండ పరిసరాల్లో ఈ రకం వేట ఎక్కువగా జరిగేది. అప్పటిలో మావోయిస్టులు ప్రభావం ఎక్కువగా ఉన్నందున అటవీసిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు సాహసించలేకపోయేవారు.
- పోడు వ్యవసాయం పేరిట అడవులను విచ్చలవిడిగా నరికేస్తున్నారు. ఈ కారణంగా కూడా మరో ప్రాంతానికి వలసిపోయే అవకాశాలు ఉన్నాయి.
- వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అటవీశాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా వాటి ప్రయోజనం కనిపించడం లేదు.

విద్యుత్ కంచెకు ప్రాణాలు బలి

నెమళ్లు, అడవి జంతువుల కోసం ఏర్పాటుచేస్తున్న విద్యుత్ కంచె ప్రాణనష్టం జరుగుతోంది. వై.రామవరం మండలంలో విద్యుత్ కంచెలో చిక్కుకుని గిరిజనులు మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. పదేళ్లక్రితం చవిటిదిబ్బలు గ్రామానికి చెందిన కుర్రే వెంకటేశ్వర్లు, గిరిజనుడు విద్యుత్ కంచెకు బలయ్యాడు. గతేడాది మండలంలోని సింహాద్రిపాలేనికి చెందిన ఓ గిరిజనుడు మృత్యువాత పడ్డాడు.



వై.రామవరం: లోతట్టు ప్రాంతం శేషరాయి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న నెమలి (ఫైల్)

ప్రత్యేక విభాగం ఉన్నా..

వన్యప్రాణి సంరక్షణకు సంబంధించి అటవీశాఖలో ప్రత్యేక విభాగం ఉంది. రంపచోడవరం అటవీడివిజన్‌కు రాజమహేంద్రవరంలో వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఉంది. దీనికి డీఎఫ్‌వో స్థాయి అధికారి ఉంటారు. వన్యప్రాణుల వేటకు సంబంధించిన సమాచారం అందిస్తే తగిన రక్షణ చర్యలు చేపడతారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

వన్యప్రాణులను వేటాడటం, హతమార్చడం చట్టరీత్యానేరం. ఎక్కడైనా వేటాడితే వెంటనే తమ సిబ్బందికి సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. వన్యప్రాణుల సంరక్షణ విభాగానికి తెలియజేస్తాం.

– సత్యనారాయణ,
డిప్యూటీ రేంజి అధికారి, వై.రామవరం

మోదకొండమ్మ జాతర దృశ్యాలు


ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు. సభ్యులు శంకర్‌నాయక్, రామలక్ష్మి,విశ్వేశ్వరరాజులను సత్కరించిన ఆలయ కమిటీ ప్రతినిధులు


ఆకట్టుకున్న గిరిజన విద్యార్థినుల నృత్యప్రదర్శన


ఐటీడీఏ ఏర్పాటు చేసిన స్టాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు


పాడేరు ప్రాంత గిరిజన సంప్రదాయ థింసా నృత్యం

టెన్త్ టాపర్లకు సన్మానం

కొయ్యూరు: పదో తరగతి పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులను తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ దుమంతి సత్యనారాయణ ఆదివారం చీడిపాలెంలో సన్మానించారు. ఇందులో భాగంగా పదో తరగతి ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన బాల పద్మజ, ముత్యాల అభిషేక్, కుప్ప అశ్విత, కోనా ప్రదీప్, పొత్తూరు రామోజీ, పాటి శ్రీ వర్ధన్, బీపీ జాహిద్, వడపల ధర్మతేజాలను శాలువా కప్పి ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. ఆయా విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి, మరిన్ని ఉత్తమ ర్యాంకులు సాధించాలని పలువురు ఆకాంక్షించారు. చీడిపాలెం సర్పంచ్ ఎన్.సోమన్నదొర, పొగడాల అరవింద్, కుప్ప గోపాల్, దోసపాటి శేషు, శ్రీరాములు, శెట్టి అబాయిదొర, దివ్య తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రామిరెడ్డి

మహారాణిపేట(విశాఖ): ప్రభుత్వ మానసిక వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కారెడ్డి వెంకటరామిరెడ్డిని నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన సోమవారం ఉదయం 10 గంటలకు పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎస్.హరికృష్ణ వ్యవహరించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతానికి చెందిన డాక్టర్ వెంకటరామిరెడ్డి ఎంబీబీఎస్, ఎండీ ఆంధ్రా మెడికల్ కాలేజీలో పూర్తి చేశారు. 1998 నుంచి 2002 వరకు సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా, 2002 నుంచి 2005 వరకు పోస్టుగాడ్యుయేట్‌గా, 2005 నుంచి 2011 వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 2011 నుంచి 2017 వరకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2017 నుంచి ప్రొఫెసర్‌గా, 2023 నుంచి సైకాలజీ విభాగాధిపతిగా పనిచేస్తున్నారు.

పర్యావరణహిత జీవనశైలితో సంపూర్ణ ఆరోగ్యం


తునికాకు కల్లల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది

మోతుగూడెం: ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరు పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవాలని సుక్కుమామిడి డీఆర్‌ఓ సత్యనారాయణ రాజు అన్నారు. పర్యావరణహిత జీవనశైలి మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా చింతూరు ఇన్‌చార్జి డీఎఫ్‌ఓ సౌజన్య ఆదేశాల మేరకు లక్కవరం అటవీ క్షేత్రాధికారి కొండలరావు పర్యవేక్షణలో లక్కవరం, సుక్కుమామిడి, దబ్బగూడెం సెక్షన్ పరిధిలోని సుక్కుమామిడి, లక్కవరం, సిరసనపల్లి, గొడ్లగూడెం, గోపాలపురం, దబ్బగూడెం గ్రామాల్లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్లకార్డులు, బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగంపై కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో సత్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా జీవించడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. ప్లాస్టిక్ సంచులని వినియోగించకుండా క్లాత్ సంచులను వాడాలని, మట్టిలో కలిసిపోయే పేపర్‌లను వినియోగించాలని, చెట్లను, అడవులను పరిరక్షించుకోవాలని, మొక్కలను విరివిగా నాటాలని సూచించారు. బీట్ అధికారులు బి.సరిత, రాజమ్మ, బసవయ్య, రామదాసు, వెంకట్, సీతయ్య, బేస్ క్యాంపు వాచర్స్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అనంతగిరి: ప్రకృతితో పాటుగా మనల్ని మనం కపాడుకోవాలని సర్పంచ్ సింహాద్రి అన్నారు. మండలంలోని ఎగువశోభ పంచాయతీ కొత్తవలస గ్రామంలోని ఆదివారం అటవీశాఖ ఆధ్వర్యంలోని పర్యావరణ కోసం జీవనశైలి కార్యక్రమంలో భాగంగా గిరిజనులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సింహాద్రి, అనంతగిరి, లోతేరు అటవీశాఖసెక్షన్ అధికారి సీతరాం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. మొక్కలతోనే మానవాళి మనుగడ ముడిపడి ఉందన్నారు. ప్రతి ఒక్కరు పర్యావరణం కాపాడేందుకు, మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చారు. వీఎస్ఎస్ చైర్మన్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అరచేతిలో తాళపత్ర నిధి

- ఒక్క క్లిక్‌తో సమస్త విజ్ఞానం మన ముందుకు..
- దశాబ్దాల నాటి తాళపత్రాలను డిజిటలైజ్ చేసిన ఏయూ
- జనబాహుళ్యంలోకి భారతీయ పురాతన సంపద

ఏయూ క్యాంపస్: దశాబ్దాల చారిత్రక సంపద అందరికీ అందుబాటులోకి వచ్చింది. తాటాకులపై రాసిన జ్ఞాన సంపదను పరిరక్షించే బాధ్యతను ఆంధ్ర విశ్వవిద్యాలయం సమర్థవంతంగా నిర్వర్తించింది. వర్సిటీ వద్ద దశాబ్దాలుగా భద్రపరిచిన లక్షలాది తాళపత్రాలను డిజిటల్ రూపంలోకి మార్పు చేసి ఇటీవల జన బాహుళ్యంలోకి తీసుకువచ్చింది. కేవలం మన కంప్యూటర్‌లో, స్మార్ట్‌ఫోన్ సహాయంతో ఒక్క క్లిక్‌తో తాళపత్రాలలో ఉన్న సమాచారాన్ని చదివే అవకాశం ఏయూ ఉచితంగా అందిస్తోంది. రండి తాళపత్రాలలో ఏముందో చదివేద్దాం..

2.58 లక్షల తాళపత్రాలు డిజిటల్ రూపం

ఏయూలో ఉన్న 1,170 తాళపత్ర గ్రంథాలలోని 2.58 లక్షల తాళపత్రాలను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియను ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. రూసా పథకంలో భాగంగా రూ.23 లక్షలతో తొలిదశ పనులను పూర్తి చేశారు. ముందుగా తాళపత్రాలను ప్రత్యేకమైన రసాయనాల సహాయంతో శుభ్రపరిచి స్కానింగ్ చేశారు. అనంతరం వాటిని తిరిగి ప్రత్యేకమైన వస్త్రంతో చుట్టి భద్రపరిచారు. తొలిదశలో డిజిటలైజేషన్ చేసిన తాళపత్రాలను ప్రజల అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు చేపట్టారు.

వెబ్‌సైట్‌లో లాగిన్ అయితే చాలు

ఆంధ్ర విశ్వ విద్యాలయం వెబ్‌సైట్‌లో


కంప్యూటర్‌లో సులభంగా చదివే విధంగా తాళపత్రాలు

www.andhrauniversity.edu.inకి వెళితే మనకి లైబ్రరీ అనే కాలమ్ కనిపిస్తుంది. దీనిని క్లిక్ చేసి తాళపత్రాలకు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చు. ప్రతి వ్యక్తి ముందుగా తమ ఈ–మెయిల్ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తమ ఈ మెయిల్ ఐడీ సహాయంతో ఒక పాస్‌వర్డ్‌ని రూపొందించుకోవాల్సి ఉంటుంది. మన ఈ మెయిల్, పాస్‌వర్డ్ ఉపయోగించి డిజిటలైజేషన్ చేసిన తాళపత్రాలను ప్రత్యక్షంగా చూడటం, చదవడం చేయవచ్చు.

విభిన్న భాషల్లో తాళపత్రాలు

ప్రస్తుతం డిజిటలైజ్ చేసిన తాళపత్రాలలో తెలుగు, సంస్కృతం, బెంగాలీ, తమిళం, దేవనాగరి తదితర భాషల్లో రాసినవి ఉన్నాయి. ఒక్కో గ్రంథంలో ఎన్ని తాళపత్రాలు ఉన్నాయి, ఒక్కో తాళపత్రం ఎన్ని లైన్లలో రాశారు, ఒక్కో లైన్‌లో ఎన్ని పదాలు ఉన్నాయి అనే సమస్త సమాచారం ఇక్కడ మనకు లభిస్తుంది. వీటిలో ఆయుర్వేదం, జ్యోతిష్యం, పురాణాలు, ఇతిహాసాలు, తర్క, తంత్ర శాస్త్రాలు, ధర్మశాస్త్రం, గద్యకావ్యాలు, అలంకారశాస్త్రం, గణితం, కావ్య, యోగ, వేదాంతం, వేదం, ఉపనిషత్‌లు, ఆగమ శాస్త్రం, శతకాలు, పూజలకు సంబంధించినవి ఉన్నాయి.

అందరూ ఉపయోగించుకోవాలి..

దశాబ్దాల క్రితం రాసినవి కావడంతో వీటిని భద్రపరచడం పెద్ద సవాలుగా నిలిచింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టును నిర్వహించారు. ప్రాచీన విజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకు రావాలనే ఉద్దేశంతో తాళపత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించి, విజయవంతంగా పూర్తి చేశారు. ఇటీవల ఏయూలో జరిగిన సౌత్ ఇండియా విశ్వవిద్యాలయ ఉపకులపతుల సమావేశంలో నాటి రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా దీనిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

పరిశోధకులు, చరిత్రకారులకు ఉపయుక్తంగా..



తాళపత్రాలపై పరిశోధనలు జరిపే వారికి, చరిత్రకారులకు వీటిపై ఆసక్తి ఉంటుంది. అటువంటి వారు ఉపయోగించుకోవాలనే మంచి సంకల్పంతో దీనిని అందరికీ అందుబాటులో ఉంచారు. కేవలం ఈ మెయిల్‌తో రిజిస్ట్రేషన్ చేసుకుని డిజిటలైజ్ చేసిన తాళపత్రాలలో సమాచారాన్ని పూర్తిగా చదివే అవకాశం కల్పిస్తున్నాం.

– ఆచార్య పి.వెంకటేశ్వర్లు, డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయాధికారి

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం


కలశపూజలో అర్చకులు

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయ ప్రథమ వార్షికోత్సం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. గౌరీపరమేశ్వరులకు పంచామృతాభిషేకం, 108 కలశాలతో కలశ పూజలు నిర్వహించారు. అమ్మవారి అభిషేకంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయం ముందు కోలాటప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. సోమవారం గౌరీపరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శీరంశెట్టి నర్సింగరావు, సహాయ కార్యదర్శి పనసా శ్రీకాంత్, కోశాధికారి వేల్పుల గణేష్, వీధి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి


మాట్లాడుతున్న ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకాసు

నర్సీపట్నం: కారుణ్య నియామకాలు త్వరితగతిన చేపట్టాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.టి. రామకాసు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రేడ్–1, 2 వారికి ఒకేసారి బదిలీలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని కోరారు. సెలవు రోజుల్లో పని చేయాలని ఒత్తిడి చేయటం సరికాదన్నారు. రీసర్వే ఖర్చులకు సంబంధించి వీఆర్వోలకు రూ.50 వేలు చొప్పున చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. సమావేశంలో కార్యదర్శి అనంతరాఘవయ్య, అసోసియేట్ అధ్యక్షుడు కె.రాజునాయుడు, నర్సీపట్నం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

గృహస్థాశ్రమ వైభవం ఎంతో గొప్పది


ప్రవచిస్తున్న చాగంటి కోటేశ్వరరావు


ప్రవచనాలు ఆలకిస్తున్న భక్తులు

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మహారాణిపేట: 'మానవ జీవనానికి సంబంధించి సనాతన ధర్మం చెప్పిన సంస్కారాల్లో అత్యంత ప్రధానమైనది వివాహం. జన్మించిన ప్రతీ వ్యక్తి కూడా తాను గృహస్థాశ్రమంలో ప్రవేశించడం కోసం పొందాల్సిన సంస్కారం ఇది. దార్శనికులైన రుషులు ప్రత్యేక ప్రయోజనం ఆపేక్షించి దీనిని వివాహం అని పిలిచారు. వి అంటే విశిష్టమైన, వాహము అంటే పొందుట..'అని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. గురజాడ కళాక్షేత్రంలో ధర్మవర్ధిని ట్రస్ట్ ఆధ్వర్యంలో గృహస్థాశ్రమ వైభవం అనే అంశంపై ఆదివారం ఆయన ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి భారీగా హాజరైన నగర ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ.. గృహస్థాశ్రమ వైభవం ఎంతో విశేషమైనదన్నారు. గృహస్థాశ్రమంలో ఉండే ధర్మాలను పాటించాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందని సూచించారు. వివాహమంటే భార్యాభర్తల అన్యోన్యతకు ఆదర్శ చిహ్నమని తెలిపారు. భార్య, భర్త కలసి చిరకాలం ఆనందంగా జీవించినప్పుడే ఆ దాంపత్యానికి సార్థకత చేకూతుందన్నారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని టీటీడీ పూర్వ ఈవో ఎల్.వి.సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ, దేవదాయ శాఖ పూర్వ కమిషనర్ వై.వి.అనురాధ, చెరువు రామకోటయ్య, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, ధర్మవధి ట్రస్ట్, చాగంటి సత్సంగ సభ్యులు, నగర ప్రజలు పాల్గొన్నారు. సోమవారం, మంగళవారం కూడా ఇదే అంశంపై ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి


అంబిరి లావణ్య (ఫైల్)

పెదబయలు: మండలంలోని గలగండ పంచాయతీ సిరశపల్లి గ్రామానికి చెందిన అంబిరి లావణ్య(11) అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు అందించిన వివరాల ఇలా ఉన్నాయి... విద్యార్థిని పెదబయలు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. గత కొంత కాలంగా రక్తహీనతతో బాధపడుతోందని, ఏప్రిల్ 25న విద్యార్థిని ఆరోగ్యం బాగోలేదని సహచర విద్యార్థులు తెలియజేయడంతో పాఠశాలకు వెళ్లి ఆస్పత్రికి తీసుకెళ్తామని పాఠశాల హెచ్‌డబ్ల్యూవోను కోరామన్నారు. అయితే పరీక్షలు జరుగుతున్నాయని, తరువాత తీసుకెళ్లాలని చెప్పడంతో తిరిగి ఇంటికొచ్చామని చెప్పారు. అనంతరం 29వ తేదీన విద్యార్థిని పరిస్థితి విషమించడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించగా, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించినట్టు చెప్పారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనె 13 తేదీ సాయంత్రం లావణ్య మృతి చెందినట్టు తల్లిదండ్రులు చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం, హెచ్‌డబ్ల్యూవో సకాలంలో స్పందించి ఉంటే తమ కుమార్తె కోలుకుని ఉండేదని లావణ్య తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విషయంపై పాఠశాల హెచ్‌ఎం నారాయణను వివరణ కోరగా పాఠశాలలో ఉన్నప్పుడు విద్యార్థినికి స్థానిక పెదబయలు పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం అందించనట్టు తెలిపారు. విద్యార్థిని లావణ్య రక్తహీనతతో మృతి చెందడం బాధాకరమని పలువురు గిరిజన సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థిని కుటుంబాన్ని సీపీఎం, గిరిజన సంఘ నాయకులు సన్నిబాబు, పృధ్వీరాజ్, సర్పంచ్ లొయితాస్, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య తదితరులు పరామర్శించారు.

నేడు రాయ్‌పూర్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: సంబల్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న బ్రిడ్జి పునర్నిర్మాణ పనుల నిమిత్తం ట్రాఫిక్ కమ్ పవర్ బ్లాక్ తీసుకుంటున్నందున ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్టు, మరికొన్నింటి దారి మళ్లిస్తున్నట్టు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈనెల 15న విశాఖపట్నం–రాయ్‌పూర్–విశాఖపట్నం(08527/08528) పాసింజర్ స్పెషల్ ఇరువైపులా రద్దు చేసినట్టు చెప్పారు. ఆదివారం తిరుపతిలో బయల్దేరిన తిరుపతి–బిలాస్‌పూర్(17482) ఎక్స్‌ప్రెస్ వయా టిట్లాఘడ్, సంబల్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

ఆరోగ్యశ్రీ పరిధిలో మానసిక వ్యాధులు

మహారాణిపేట: మానసిక వ్యాధులను కూడా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఇప్పటికే అనేక వ్యాధులకు ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. క్యాన్సర్ వంటి రోగాలను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చారు. తాజాగా మానసిక వ్యాధులను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చడంపై సంబంధిత రోగుల బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో మానసిక రోగులకు చికిత్స అందిస్తున్న ఏకైక ఆస్పత్రి నగరంలోనే ఉంది. 1860లో స్థాపించిన ఈ ఆస్పత్రి అంచెలంచెలుగా విస్తరించారు. 1950లో ఈ ఆస్పత్రిని ఆంధ్రా మెడికల్ కాలేజీకి అనుబంధంగా 300 పడకల బోధనాస్పత్రిగా తీర్చిదిద్దారు. ప్రతి రోజూ ఆస్పత్రికి 200 నుంచి 300 మంది వరకు రోగులు వస్తుంటారు.

మన రాష్ట్రంతో పాటు ఒడిశా, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లోని పలు జిల్లాల నుంచి మానసిక రోగులకు ఇక్కడ సేవలందిస్తున్నారు. మానసిక వ్యాధుల చికిత్సను ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చిన నేపథ్యంలో.. రోగులకు మరింత నాణ్యమైన సేవలందనున్నాయని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

పరిమళించిన మానవత్వం

అరకు ఎంపీ దంపతుల ఔదార్యం

కొయ్యూరు: అరకు ఎంపీ మాధవి, శివప్రసాద్ దంపతులు మానవత్వాన్ని చాటుకున్నారు. దిక్కుతోచని స్థితిలో మృతదేహాన్ని కేజీహెచ్ నుంచి ఎలా తరలించాలో తెలియని సమయంలో ఎంపీ దంపతులు ఆదివారం మహాప్రస్థానం వాహనం ఏర్పాటు చేసి స్వగ్రామాన్ని తరలించే ఏర్పాట్లు చేశారు. వెలగలపాలెనికి చెందిన వాపడల్లి సోములమ్మ(68) శనివారం జీడిమామిడి తోట నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా జారిపడింది. ఆమె తలకు తీవ్ర గాయమైంది. కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న అరకు ఎంపీ భర్త శివప్రసాద్ కేజీహెచ్ వైద్యులతో మాట్లాడారు. పోలీసులతో మాట్లాడి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. మహాప్రస్థానం వాహనాన్ని ఏర్పాటు చేసి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించే ఏర్పాట్లు చేశారు. మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి, మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులు అరకు ఎంపీ మాధవి, శివప్రసాద్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.


మహాప్రస్థానం వాహనం వద్ద శివప్రసాద్

టికెట్ చెకింగ్‌పై త్రినేత్రం

- రైల్వే బోర్డు వినూత్న ప్రయోగం
- టికెట్ కలెక్టర్లకు బాడీ కెమెరాలు
- పారదర్శకంగా తనిఖీలకు చర్యలు
- వాల్తేరు డివిజన్‌లో అమలుకు ప్రణాళికలు



రైళ్లలో టికెట్ చెకింగ్, (ఇన్‌సెట్) బాడీ కెమెరా

సాక్షి, విశాఖపట్నం: రైళ్లలో హింసాత్మక చర్యలను నిరోధించే లక్ష్యంతో రైల్వే బోర్డు వినూత్న చర్యలకు శ్రీకారం చుట్టింది. టికెట్ చెకింగ్ సమయంలో వస్తున్న ఆరోపణలు, ప్రయాణికులతో వాగ్వాదాలకు చెక్ చెప్పేలా టికెట్ కలెక్టర్లకు బాడీ కెమెరాలు ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే మధ్య రైల్వే జోన్ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్ట్ అమలు చేస్తున్న నేపథ్యంలో.. మిగిలిన జోన్లకు విస్తరించేందుకు సమాలోచనలు చేస్తోంది. త్వరలోనే ఈస్ట్‌కోస్ట్ పరిధిలోని వాల్తేరు డివిజన్‌లో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది.

రైలు ప్రయాణంలో టికెట్ తనిఖీలు చేసే సమయంలో ప్రయాణికులతో సిబ్బందికి వాగ్వాదాలు తరచూ జరుగుతున్నాయి. ఇదే సమయంలో టికెట్ కలెక్టర్లపై ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. వెయిటింగ్ టికెట్ తనిఖీ చేసే సమయం, ఆర్ఏసీ ఉన్న ప్రయాణికులకు బెర్త్‌లు కేటాయించే విషయంలోనూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వీటికి పూర్తిస్థాయిలో చెక్ చెప్పాలని రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ తనిఖీ అధికారులకు బాడీ కెమెరాలు అమర్చుతోంది. పైలట్ ప్రాజెక్టుగా మూడు నెలల కిందట సెంట్రల్ రైల్వే పరిధిలో 50 మంది టికెట్ కలెక్టర్లకు బాడీ కెమెరాలు అమర్చింది. అప్పటి నుంచి ఒక్క ఫిర్యాదు గానీ, ప్రయాణికుల వాగ్వాద సంఘటనలు నమోదు కాలేదు. దీంతో మిగిలిన జోన్లలోనూ అమలు చేయాలని బోర్డు నిర్ణయించింది.

ఒక్కో కెమెరా రూ.9 వేలు..

రైల్వే నెట్‌వర్క్ పరిధిలోని అన్ని జోన్లకూ బాడీ కెమెరాలు అందించాలని రైల్వే మంత్రిత్వ శాఖ బోర్డుకు సూచించింది. ఈ నేపథ్యంలో ఈస్ట్‌కోస్ట్ జోన్ పరిధిలో బాడీ కెమెరాలు అందించనున్నారు. ఇందులో భాగంగా వాల్తేరు డివిజన్ పరిధిలో టీటీలకు వీటిని అమర్చనున్నారు. ఒక్కొక్కటి రూ.9,000తో కొనుగోలు చేసిన ఈ బాడీ కెమెరాలు దాదాపు 20 గంటల ఫుటేజీని రికార్డు చేయగలవు. బాడీ కెమెరాలు టికెట్ తనిఖీ సమయంలో ఉద్యోగుల పారదర్శకతను కాపాడుకోవడంలో సహాయపడతాయి. దీంతో పాటు అక్రమ చర్యలను నిరోధించవచ్చు. ఫిర్యాదుల సందర్భంలో, టిక్కెట్ తనిఖీ సమయంలో ఏదైనా వ్యత్యాసాన్ని గుర్తించడంలో కీలక పాత్ర పోషించనున్నాయని వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు చెబుతున్నారు. వృత్తి నైపుణ్యం పెంచడంతో పాటు సిబ్బంది రక్షణకు దోహదపడతాయని అభిప్రాయపడుతున్నారు.